
RNI No: APTEL /25/A2860

సీమ వార్త
# సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 12 | పేజీలు : 4 | గురువారం 16 జూలై 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



## న్యూజిలాండ్‌లో భూకంపం

- సునామీ హెచ్చరిక జారీ
- న్యూజిలాండ్ దక్షిణ దీవిని వణికించిన భూకంపం
- రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైన తీవ్రత
- పశ్చిమ తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ
- ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు వెళ్లాలని అధికారుల సూచన
- తక్షణ ప్రాణ, ఆస్తి నష్టంపై సమాచారం లేదు

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

ప్రధాని మోదీకి కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే లేఖ

డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశానికి డిమాండ్

సవరించిన బిల్లులపై ముందస్తు చర్చకు విజ్ఞప్తి

ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందని బిల్లు

పార్టీలకు అధ్యయనం చేసేందుకు సమయం ఇవ్వాలని విన్నపం

కేంద్రానికి కాంగ్రెస్ కీలక విజ్ఞప్తి





## పీపీపీతోనే వేగంగా అభివృద్ధి

‘వీజీఎఫ్ విప్లవం’పై సీఎం చంద్రబాబు దృష్టి

భవిష్యత్తులో వీజీఎఫ్ విప్లవం ఖాయమన్న సీఎం చంద్రబాబు

ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమని వెల్లడి

త్వరలో ‘పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0’కు రూపకల్పన

పీపీపీ కింద రూ.1.23 లక్షల కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు

నిరర్ధక ప్రభుత్వ ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని ఆదేశం

**అమరావతి**

రాష్ట్రంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానమే కీలకమని, భవిష్యత్తులో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్)తో కూడిన ప్రాజెక్టులు విప్లవాత్మక మార్పులు తేనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టులు, ప్రభుత్వ వ్యయంపై గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. త్వరలోనే ‘ఆంధ్రప్రదేశ్ పీపీపీ-వీజీఎఫ్ పాలసీ 1.0’ను కేబినెట్ ముందుకు తీసుకురావాలని, దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పర్యాటకం సహా వివిధ రంగాల్లో రూ.1,23,229 కోట్ల విలువైన 260 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో పురోగతిలో ఉన్నాయని ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. పీపీపీ కింద చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణ విధానాన్ని కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగం ప్రశంసించిందని, ఈ ప్రాజెక్టులకు రూ.1,468 కోట్ల వీజీఎఫ్ రానుందని తెలిపారు. అలాగే, విజయవాడ, తిరుపతిలోని వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు కేంద్రం రూ.178 కోట్ల వీజీఎఫ్ అందిస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ప్రతీ ప్రాజెక్టును ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఉండేలా సస్టెయినబుల్ మోడల్‌లో అభివృద్ధి చేయాలని సూచించారు. కోస్టల్ టూరిజం ప్రాజెక్టులలో స్థానిక మత్స్యకారులను భాగస్వాములను చేసి వారికి ప్రయోజనం చేకూర్చాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రధాన దేవాలయాల వద్ద మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం వద్ద నిరుపయోగంగా ఉన్న ఆస్తులను అవకాశాలుగా మార్చుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని బస్టాండ్ల వద్ద ఉన్న భూములను వాణిజ్యపరంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ ఆదాయ మార్గాలను పెంచుకునేందుకు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఫైనాన్షియల్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.



## డిజిటల్ వ్యూహంతో పార్టీ బలోపేతం

‘జగన్ 2.0 సూపర్ యాప్’ను ఆవిష్కరించిన వైఎస్ జగన్

వైసీపీ కుటుంబ సభ్యుల కోసమే ఈ కొత్త యాప్ అన్న జగన్

తాడేపల్లిలో జరిగిన పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రారంభం

యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపు

**అమరావతి**

వైసీపీ తమ శ్రేణులను బలోపేతం చేసే దిశగా డిజిటల్ బాట పట్టింది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ‘జగన్ 2.0 సూపర్ యాప్’ను గురువారం ప్రారంభించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆయన ఈ యాప్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ యాప్‌ను - మిగతా3లో

## అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారు

ఓట్లు వేయలేదనే కక్షతోనే సీతారామ ప్రాజెక్ట్‌ను గాలికి వదిలేశారు

బీఆర్ఎస్‌పై పొంగులేటి ఫైర్

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు ఆదరించలేదని బీఆర్ఎస్ కక్షగట్టిందన్న పొంగులేటి

సీతారామ ప్రాజెక్టుకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపాటు



**ఖమ్మం**

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎప్పుడూ సరిగా ఆదరించడం లేదనే కక్షతోనే... ఆ జిల్లాకు అత్యంత కీలకమైన సీతారామ ప్రాజెక్టుతో పాటు పలు నీటి పారుదల ప్రాజెక్టులను గత పాలకులు గాలికి వదిలేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. - మిగతా3లో



## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

హైదరాబాదులో పవన్ నివాసానికి వెళ్లిన ఏపీ గవర్నర్

ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైనం

పవన్ ఇంటిలోని గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలపై చర్చ

త్వరగా కోలుకుని విధుల్లో చేరాలని ఆకాంక్ష

## గోల్కొండలో ఘనంగా ఆషాఢ బోనాలు

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

ఉత్సవాల్లో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో తరలివచ్చిన వేలాదిమంది భక్తులు



**హైదరాబాద్**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల జాతర హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ లంగర్ హౌస్ చౌరస్తా వద్ద శ్రీ జగదాంబ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకతో రాష్ట్రవ్యాప్తంగా నెలరోజుల పాటు జరిగే బోనాల పండుగకు అంకురార్పణ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, నాయకులు మధు యాష్కీ గౌడ్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, కల్వ సుజాతతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ జానపద సంప్రదాయాలకు అద్దం పట్టే ఈ పండుగలో భాగంగా, భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ‘బోనం’ సమర్పించారు. అన్నం, బెల్లం, పెరుగుతో నింపిన కుండలను నైవేద్యంగా నివేదించి, అంటువ్యాధుల నుంచి రక్షించి, పాడిపంటలతో రాష్ట్రాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తిగీతాల ఆలాపనలతో గోల్కొండ పరిసర ప్రాంతాలు మార్మోగాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటలో మొదలైన ఈ ఉత్సవాల కోసం హైదరాబాద్ పోలీసులు పటిష్ఠమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

గురువారం 16 జూలై 2026

సీమ వార్త
సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

# సొంత శాఖ కోసం.... హస్తినలో సవిత..!!







**పుట్టపర్తి డెస్క్ జులై 16 సీమ వార్త సాయంత్రం.**

భారత్ టెక్స్ 2026లో పాల్గొనడానికి రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం ఉదయం ఢిల్లీ చేరుకున్నారు. ముందుగా, మంత్రి సవితకు కేంద్ర హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రోమోషనల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్, ఏపీహెచ్డీసీ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాదరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ ను మంత్రి సవిత సందర్శించారు. భారత్ టెక్స్ – 2026 లో పాల్గొన్న మంత్రి సవితతో భారత్ టెక్స్ 2026 ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ నరేన్ గోయెంకా భేటీ అయ్యారు. భారత్ టెక్స్ 2026 నిర్వహణ తీరుతెన్నులు వివరించారు.

# తాళం వేసిన ఇంటికి పోలీసుల భరోసా

## ప్రజల భద్రతే... పోలీసుల బాధ్యత.... ఎల్‌హెచ్ఎంఎస్‌తో నిశ్చింత జీవితం

**పుట్టపర్తి జులై 16 సీమ వార్త సాయంత్రం.**





శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారు వినూత్న ఆలోచనను ధర్మవరం ఒకటవ పట్టణ సీఐ రెడ్డప్ప సమర్థవంతంగా అమలు. ధర్మవరం: ప్రజల ఆస్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ శ్రీ సత్యసాయి జిల్లా పోలీసు శాఖ అమలు చేస్తున్న కార్యక్రమం ప్రజల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ దూరదృష్టితో ప్రారంభమైన ఈ వినూత్న కార్యక్రమాన్ని ధర్మవరం ఒకటవ పట్టణ పరిధిలో సీఐ రెడ్డప్ప తన సిబ్బందితో విజయవంతంగా అమలు చేస్తున్నారు.ఇంటికి తాళం వేసి ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రోజులు బయటకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు సమాచారం అందిస్తే, ఆ ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. దీంతో చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలను నివారించడంతో పాటు ప్రజల్లో భద్రతాభావం మరింత పెరుగుతోంది. సాంకేతికతను వినియోగిస్తూ ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్‌ను అందించాలనే ఎస్పీ సతీష్ కుమార్ సంకల్పానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోంది. ఆ ఆశయాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ ధర్మవరం ఒకటవ పట్టణ సీఐ రెడ్డప్ప తన విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకుంటున్నారు. ప్రజల రక్షణే లక్ష్యంగా శ్రీ సత్యసాయి జిల్లా పోలీసులు చేపడుతున్న ఈ కార్యక్రమం రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ల భద్రత కోసం ఈ సేవలను వినియోగించుకుని పోలీసులతో సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

# పేషంట్లపై ప్రేమ చూపండి..!!

.....ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన పరిటాల సునీత

....ఆసుపత్రి పరిశుభ్రంగా, వైద్యులు అందుబాటులో ఉండాలన్న ఎమ్మెల్యే సునీత

....పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన వైద్యులు, సిబ్బంది

....శ్రేయోభిలాషుల కుటుంబానికి పరామర్శ, ప్రజల నుంచి వినతుల స్వీకరణ

**రామగిరి జులై 16 సీమ వార్త సాయంత్రం.**





రామగిరి మండలం పేరూరు ప్రాజెక్టు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం ఉదయం ఆమె ఆసుపత్రికి వెళ్లగానే.. అక్కడున్న వైద్యులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న చికిత్సలను పరిశీలించారు. ఆసుపత్రితో పాటు పరిసరాల్ని పరిశీలించి.. వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. వైద్యులు సమయానికి రావాలన్నారు. రోగులతో మర్యాదపూర్వకంగా ఉండాలని.. పెద్ద సమస్య ఉంటే తప్ప.. ఇతర హాస్పిటల్స్ కు రెఫర్ చేయవద్దన్నారు. వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో ఉన్న సమస్యల్ని ఎమ్మెల్యే సునీత దృష్టికి తీసుకెళ్లారు. ఫార్మసీ (మెడిసిన్స్) నిర్వహణ కోసం ప్రత్యేకంగా గది, వైద్యం కోసం వచ్చిన వారికి తగినన్ని బెడ్లు లేకపోవడం, నీటి సమస్యను ఎమ్మెల్యేకి వివరించగా వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన కుటుంబ శ్రేయోభిలాషి పెద్ద వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే సునీత ఆయన నివాసానికి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ తర్వాత వెంకటాపురంలోని తన కార్యాలయానికి వివిధ కారణాలు సమస్యలు నిమిత్తం వచ్చిన వారితో సమావేశమయ్యారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే సునీత హామీ ఇచ్చారు.



# చదువులో ప్రతిభ చూపితే... భవిష్యత్తుకు భరోసా

## వార్డన్‌లు విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలి

## వసతి గృహాలలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

## ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు ఇ.లక్ష్మిరెడ్డి

**కళ్యాణదుర్గం, జూలై 16 సీమ వార్త సాయంత్రం.**



వార్డన్లు వసతి గృహాలలోని విద్యార్థులను తమ సొంత బిడ్డల్లా చూసుకోవాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. గురువారం, ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహాన్ని మరియు ప్రభుత్వ బాలికల వసతి గృహము కళ్యాణదుర్గం నెంబర్-2 ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారులు విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వసతి గృహాలలో టాయిలెట్లు, బాత్రూంలను ప్రతిరోజూ శుభ్రపరిచి పారిశుధ్య లోపాలు లేకుండా చూడాలని మరియు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ... ప్రతి విద్యార్థిని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా చదువులో ప్రతిభ కనబరచాలని విద్యార్థినిలకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మిరెడ్డి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ శోభారాణి, ఐసిడిఎస్ పిడి సాహిదా బేగం, పౌరసరఫరాల డిఎం రమేష్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాజేశ్వరమ్మ, బీసీ వెల్ఫేర్ డిడి కుశుబు కొఠారి, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్, తదితర అధికారులు పాల్గొన్నారు.





సీమ వార్త సాయంకాలం

గురువారం
16 జూలై 2026

# మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రధానికి లేఖ రాశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే ముందు పార్టీలకు వాటిని పూర్తిగా పరిశీలించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కూడా డీలిమిటేషన్ ప్రతిపాదనలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే పేర్కొన్నారు. ఆ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు–2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ తీసుకురానున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, అనుబంధ అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించాలని ఖర్గే లేఖలో కోరారు. బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు వాటిని అధ్యయనం చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లు–2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు–2026 కూడా ఏప్రిల్‌లో లోక్‌సభలో ఆమోదం పొందలేదు. ఈ ప్రతిపాదనల ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు అవకాశం కల్పించనున్నారు.

## అబద్ధాలు చెబుతూ కాలం గడుపుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి ఈరోజు ఆయన ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయలేదనే కోపంతో... గిరిజనులు అధికంగా ఉండే కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు లైఫ్ లైన్ లాంటి సీతారామ ప్రాజెక్ట్‌కు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పొంగులేటి ఆరోపించారు. ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన బీఆర్ఎస్ పెద్దలు కడుపులో విషం పెట్టుకుని, అబద్ధాలు ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో ప్రజల కష్టాలను గుర్తించని నాటి నాయకులు... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో చూసి జ్ఞానం తెచ్చుకోవాలని హితవు పలికారు. “గత ప్రభుత్వం కట్టిందని మేము ఏ ప్రాజెక్ట్‌ను వదిలేయం. ఎటువంటి భేషజాలకు, పట్టుదలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నాం. సీతారామతో పాటు కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కూడా పునరుద్ధరించే తపనతో పనిచేస్తున్నాం” అని మంత్రి స్పష్టం చేశారు. దివంగత రాజశేఖర రెడ్డి హయాంలో ప్రాజెక్ట్‌లకు మహర్దశ పట్టినట్లే, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా నీటి పారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత పాలకులు ఉన్న నిధులన్నీ కొల్లగొట్టినా... కాంగ్రెస్ ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేస్తూ ఒకవైపు సంక్షేమ పథకాలను, మరోవైపు ప్రాజెక్టులను నడిపిస్తోందని పొంగులేటి వివరించారు. గతంలో ఈ సీతారామ ప్రాజెక్ట్‌కు కేవలం రూ. 115 కోట్లు మాత్రమే ఖర్చు చేసి వదిలేశారని... కానీ ఇప్పుడు తమ ప్రభుత్వం నిధులిచ్చి, 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఖమ్మం, వైరా, సత్తుపల్లి తదితర ప్రాంతాల తాగునీటి అవసరాలను తీరుస్తోందని చెప్పారు. దీని ద్వారా ప్రస్తుతం 1.25 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తూ కరవు నుంచి రైతులను కాపాడుతున్నామని, అవసరమైతే అదనంగా కూడా నీటిని విడుదల చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం గట్టిగా పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

## డిజిటల్ వ్యూహంతో పార్టీ బలోపేతం

-మొదటిపేజీ తరువాయి

వైసీపీ కుటుంబం కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు పార్టీ తన అధికారిక ‘ఎక్స్’ ఖాతాలో వెల్లడించింది. కార్యకర్తలు ఈ యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతూ సంబంధిత లింక్‌ను కూడా పంచుకుంది. గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో ఇది అందుబాటులో ఉంటుందని, సులభంగా డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రచార చిత్రాలను విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోలో, జగన్ పార్టీ నేతలను ఉద్దేశించి యాప్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియాలో తమ కార్యకర్తలు పోస్ట్ చేసే కంటెంట్‌ను తొలగిస్తున్నారని, ఈ క్రమంలో పార్టీ కోసం ఒక ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ యాప్ ద్వారా కార్యకర్తలు తమ అభిప్రాయాలను నిరభ్యంతరంగా వ్యక్తం చేయవచ్చని, పార్టీతో నిత్యం అనుసంధానమై ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా నాయకులు, కార్యకర్తలు నిరంతరం సమన్వయంతో ఉండే అవకాశం ఉంటుందని జగన్ తెలిపారు. పార్టీ నిర్వహించే విలేకరుల సమావేశాలు, పర్యటనలు, అధికారిక ప్రకటనలు వంటి సమాచారం అంతా ఈ యాప్ ద్వారా ప్రతి కార్యకర్తకు చేరువవుతుందని అన్నారు. త్వరలోనే ఈ యాప్‌లో డిజిటల్ డైరీ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.

## న్యూజిలాండ్‌లో భూకంపం

న్యూజిలాండ్‌లో భూకంపం సంభవించింది. దేశంలోని దక్షిణ దీవిలో గురువారం 6.3 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పశ్చిమ తీర ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫియోర్డ్‌ల్యాండ్ రీజియన్‌లోని టె అనౌకు 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా మిల్ఫోర్డ్ సౌండ్ నుంచి ప్యూసెగుర్ పాయింట్ వరకు ఉన్న దక్షిణ దీవి పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు జారీ చేశారు. సముద్రపు అలలు తీరప్రాంతాల్లోకి చొచ్చుకువచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు తక్షణమే ఎత్తైన ప్రదేశాలకు లేదా లోతట్టు ప్రాంతాల నుంచి దూరంగా వెళ్లాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు నడిచి, పరిగెత్తి లేదా సైకిళ్లపై సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆస్ట్రేలియన్, పసిఫిక్ టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులో న్యూజిలాండ్ ఉండటంతో ఇక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. 2011లో సంభవించిన క్రైస్ట్‌చర్చ్ భూకంపం 185 మందిని బలిగొన్న విషయం తెలిసిందే. తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ప్రధాన ఆస్తి నష్టం గానీ జరిగినట్లు ఇంకా సమాచారం అందలేదని, పరిస్థితిని సమీక్షిస్తున్నామని జాతీయ అత్యవసర నిర్వహణ ఏజెన్సీ (ఎన్ఈఎంఏ) అధికారులు తెలిపారు.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన గవర్నర్ అబ్దుల్ నజీర్...

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం పరామర్శించారు. ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్, ప్రస్తుతం హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం గవర్నర్ ఆయన నివాసానికి చేరుకుని, ఆయన్ను ఆత్మీయంగా పలకరించారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణుల సూచనలను, సలహాలను తప్పనిసరిగా పాటించాలని పవన్‌కు సూచించారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, ప్రజాసేవలో తన విధులను తిరిగి ప్రారంభించాలని గవర్నర్ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ జస్టిస్ నజీర్, పవన్ కల్యాణ్ నివాసంలో ఉన్న గ్రంథాలయాన్ని ప్రత్యేకంగా సందర్శించడం విశేషం. ఆ లైబ్రరీలో ఉన్న పలు పుస్తకాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ప్రపంచ ప్రఖ్యాత రచయితలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రాసిన అనేక గ్రంథాలను చూసి, వాటిపై పవన్ కల్యాణ్‌తో ఉత్సాహంగా చర్చించారు. ఇద్దరి మధ్య పుస్తకాలపై ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన అభ్యర్థన మేరకు, జస్టిస్ అబ్దుల్ నజీర్ ఓ పుస్తకంపై తన సంతకం చేశారు. తన ఆరోగ్యం గురించి వాకబు చేసేందుకు స్వయంగా సమయం తీసుకుని ఇంటికి వచ్చిన గవర్నర్‌కు పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన పూర్తిగా మర్యాదపూర్వకంగా, ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## అడుగంటిన...పోరుమామిళ్ల పెద్ద చెరువు.

**దిక్కుతోచని స్థితిలో 6 వేల ఎకరాల ఆయకట్టు రైతులు**

**తెలుగుగంగ బ్రహ్మసాగర్ నుంచి వెంటనే నీరు విడుదల చేయాలి**

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మి నారాయణ రెడ్డి**



**పోరుమామిళ్ల జూలై 16 సీమ వార్త. సాయంత్రం** రాయలసీమలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చెరువుల్లో ఒకటైన కడప జిల్లా పోరుమామిళ్ల పెద్ద చెరువు పూర్తిగా అడుగంటిపోవడం వేలాది మంది రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మి నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాభావ పరిస్థితులతో పాటు చేపల కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా చెరువులోని నీరంతా వృథాగా పోవడంతో సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టు ప్రమాదంలో పడిందన్నారు. ఈ చెరువుపై ఆధారపడి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నార్లు పోసుకున్న రైతులు ఇప్పుడు పంటలను ఎలా కాపాడుకోవాలో తెలియక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు.చేపల కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రైతులకు తీవ్ర నష్టం,రైతుల ఆరోపణల ప్రకారం, చెరువులో చేపల పెంపకం చేపట్టిన కాంట్రాక్టర్ తన చేపల వేట కోసం చెరువులోని నీటిని బయటకు వదిలేయడంతో సాగునీరు పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఒక కాంట్రాక్టర్ లాభపడగా వేలాది మంది రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

### సాగు సీజన్ ప్రారంభంలోనే సంక్షోభం

మే నెల నుంచే రైతులు నార్లు పోసుకుని సాగుకు సిద్ధమయ్యారని, ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తయ్యాయని, మరికొన్ని ప్రాంతాల్లో నారు ముదిరి నాటుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే చెరువులో పెద్ద తూము వద్ద మాత్రమే కొద్దిపాటి నీరు మిగిలి ఉందని, అది కూడా మరో 20 రోజుల వరకు మాత్రమే సరిపోతుందని చెప్పారు. మిగిలిన తూముల పరిధిలోని రైతులకు వారం నుంచి పది రోజులకు మించి నీరు అందే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు.తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు చెరువు పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భ జలాలు కూడా గణనీయంగా పడిపోయాయని తెలిపారు. సాగునీరు లేకపోవడమే కాకుండా గ్రామాల్లోని బోర్లలో తాగునీరు కూడా అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. పోరుమామిళ్లతో పాటు కాశినాయన, కలసపాడు, బి.కోడూరు మండలాల్లోని చెరువులు కూడా నీరు లేక వెలవెలబోతున్నాయని పేర్కొన్నారు.

### తెలుగుగంగ నీటి విడుదలే పరిష్కారం

ప్రభుత్వం వెంటనే స్పందించి తెలుగుగంగ బ్రహ్మసాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని చాపాటి లక్ష్మి నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. దీనివల్ల సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారమవుతుందని అన్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాల పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ఆ పనులు పూర్తయితే వరికుంట్ల, ఇటుగుళ్లపాడు, గంగనపల్లి, బాలాయపల్లి, తెల్లపాడు, తడుకు తదితర వెనుకబడిన గ్రామాలకు కూడా సాగునీరు అందుతుందని తెలిపారు.

# ప్రాథమిక నివేదికలో కీలక అంశాలు



అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో 24 నుంచి 48 గంటల్లో ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వానికి తన తుది నివేదికను సమర్పించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆ నివేదిక గురువారం లేదా శుక్రవారం ప్రభుత్వానికి అందే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో సిట్ దర్యాప్తు గడువును ఇకపై పొడిగించే అవకాశం లేదని కూడా తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తును మరింత విస్తృతంగా చేపట్టేందుకు ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం జూలై 1న సిట్‌కు 15 రోజుల గడువు పొడిగించింది. విరాళాల లెక్కింపు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు, నగదు నిర్వహణ, సంబంధిత సిబ్బంది పాత్ర వంటి అన్ని అంశాలపై సమగ్రంగా విచారణ జరిపిన అనంతరం తుది నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.

సిట్ ఇప్పటికే సమర్పించిన ప్రాథమిక నివేదికలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 2026 మధ్య కాలంలో సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా సుమారు 70 అనుమానాస్పద ఘటనలు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. నగదు లెక్కింపు బాధ్యతలు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది నగదు కట్టలను దాచిపెడుతున్న దృశ్యాలు సీసీటీవీలో నమోదైనట్లు అందులో ప్రస్తావించింది. అలాగే విరాళాల దుర్వినియోగానికి దారితీసిన పలు లోపాలను కూడా సిట్ గుర్తించింది. నగదు లెక్కింపు కేంద్రంలోకి ప్రవేశించే సమయంలో, బయటకు వెళ్లే సమయంలో సిబ్బందిని తనిఖీ చేయకపోవడం, వ్యక్తిగత వస్తువులపై సరైన నియంత్రణ లేకపోవడం, వేర్వేరు హుండీల నుంచి వచ్చిన నగదును ఒకేసారి కలిపి లెక్కించడం వంటి అంశాలు ఈ ఘటనకు అవకాశం కల్పించినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

### నగదు స్వాధీనం

దర్యాప్తు ప్రారంభానికి ముందే కొందరు ఉద్యోగుల వద్ద నుంచి రూ.78.94 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు నివేదిక వెల్లడించింది. అంతేకాకుండా జూన్ 4న నగదు లెక్కింపు గదికి ఆనుకుని ఉన్న బాత్‌రూమ్‌లో మరో రూ.2.25 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సిట్ తెలిపింది. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చిన వెండి ఇటుకలు, ఇతర విలువైన కానుకలు కనిపించకుండా పోయాయన్న ఆరోపణలకు ఇప్పటివరకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లభించలేదని కూడా సిట్ తన నివేదికలో స్పష్టం చేసింది.

### ఎనిమిది మంది నిందితులకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల జ్యుడీషియల్ కస్టడీని అయోధ్య కోర్టు మరో 14 రోజుల పాటు పొడిగించింది. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులను కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నెల 27న వారిని మరోసారి కోర్టు ఎదుట హాజరుపరచనున్నారు. రామజన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై స్వతంత్రంగా, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ఇటీవల విచారణకు స్వీకరించింది.

ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తన దర్యాప్తు పురోగతిపై స్థితిగతుల నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అలాగే సిట్‌లో ఉన్న సభ్యుల వివరాలను కూడా అందించాలని సూచించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

### ట్రస్ట్‌లో రాజీనామాలు

విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ట్రస్ట్ అప్పటి ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌తో పాటు ట్రస్ట్ సభ్యులు అనిల్ మిశ్రా, గోపాల్ రావు రాజీనామాలు చేశారు. ట్రస్ట్ వారి రాజీనామాలను ఆమోదించింది. ఇప్పుడు సిట్ తుది నివేదికపై అందరి దృష్టి నెలకొంది. ఈ నివేదిక ఆధారంగా ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు సుప్రీంకోర్టు విచారణ, సిట్ నివేదిక, కోర్టులో కొనసాగుతున్న కేసు పరిణామాలు ఈ వ్యవహారంలో కీలకంగా మారనున్నాయి.

## షైనింగ్ స్టార్ వార్డుకు ఎంపికైన కేజీబీవీ 10వ తరగతి విద్యార్థిని



**అమరాపురం జూలై 16 సీను వార్త సాయంత్రం** మండల కేంద్రంలోని అమరాపురం కస్తూరిబా గాంధీ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన జి లావణ్య అనే విద్యార్థిని ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. పదవ తరగతి పరీక్షలైందు 600 మార్కులకు గాను 552 మార్కులు కేజీబీవీ విద్యార్థిని జి లావణ్య సాధించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా త్వరలో విజయవాడలో అవార్డు తీసుకుపోతున్న విద్యార్థినిని ప్రిన్సిపాల్ అనిత మరియు పాఠశాల బోధన సిబ్బంది జానకి, లతా, సుజాత, స్వాతి,శాంతిప్రియ తదితరులతోపాటు బోదనీతర సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన అవార్డులను స్వీకరించాలని వారు విద్యార్థిని లావణ్య కు ఆశీస్సులు అందించారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషిచేసిన శాకమ్మ మృతి తీరని లోటు మడకశిర జూలై 16 సీమ వార్త సాయంత్రం వైకాపా పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషిచేసిన సాకమ్మ మృతి వైయస్సార్సీపీకి తీరని లోటు అని సీనియర్ వైకాపా నాయకుడు రవి శేఖర్ రెడ్డి తెలిపారు.హరేసముద్రం పంచాయతీ గల గొల్లపల్లి గ్రామంలో వైఎస్ఆర్సిపి పార్టీ కోసం పార్టీ పటిష్ట కోసం జగన్ వీరాభిమానురాలు ప్రతి సభలోను పాల్గొంటూ 2029లో జగనన్న సీఎం అవ్వడం కోసం కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి సాకమ్మ బుధవారం చేనులో కలుపుతీస్తుండగా పాము కాటుతో మృతి చెందడం చాలా విషాదకరమని. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు . భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు రాష్ట్రసంయుక్త కార్యదర్శి వై ఎన్ రవిశేఖర్ రెడ్డి , జిల్లా బీసీ సెల్ కార్యదర్శి మాజీ సర్పంచ్ కరీయున్న,మండల కార్యదర్శి కె.పి సుధాకర్ . పంచాయతీ కార్యదర్శి నటరాజ్ మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు. బి ఎల్ ఏ శేఖర్ రామచంద్రప్ప ఆనంద . నరసింహ పంచాయతీ వైఎస్ఆర్సిపి పార్టీ నాయకు లు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పాల్గొని భౌతిక కాయానికి నివాళులర్పించారు.

## టిడిపి, జనసేన పార్టీ గల వీడి వైఎస్ఆర్సిపి లోకి చేరిక

**పార్టీ కండువా వేసి ఆహ్వానించిన దీపిక వేణు రెడ్డి**



**లేపాక్షి జూలై 16 సీమ వార్తా సాయంత్రం.** హిందూపురం పట్టణంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయము నందు గురువారం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు రెడ్డి సమక్షంలో లేపాక్షి మండల కన్వీనర్ సయ్యద్ నిసార్, మండల సీనియర్ నాయకులు శేషాద్రి రెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి విజయ్ కుమార్ అప్పన్న నరసింహమూర్తి ఆధ్వర్యంలో టిడిపి జనసేన పార్టీలకు చెందిన నాయన పల్లి పంచాయతీ ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వారు వైసీపీలోకి చేరడం జరిగింది. పార్టీలోకి చేరిన జయకృష్ణ, నరసింహమూర్తి ప్రవీణ్ శివకుమార్ మధుసూదన్ నారాయణస్వామి లోకేష్ శివన్న గోపీనాథ్ నవీన్ కుమార్ సాయి గంగాధర్ లు ఉన్నారు. వారందరికీ దీపికా వేణు రెడ్డి వైఎస్ఆర్సిపి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీలో చేరిన వారికి సూచించారు. మరో ఏళ్లు ఓపిగ్గా ఉండాలని ఆ తర్వాత వచ్చేది ప్రభుత్వమేనని పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని ప్రజలకు వివరిం చాలని నాయకు లకు దీపికా వేణు రెడ్డి సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ ఎ శివ, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస రెడ్డి, మండల ప్రెసిడెంట్ రామాంజి, నాయన పల్లి పంచా యతీ కమిటీ ఉపా ధ్యక్షుడు బాబు, నాయకులు కేశవ మూర్తి పాల్గొన్నారు.

సీమ వార్త సాయంకాలం

గురువారం
16 జూలై 2026

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి..




**మడకశిర జూలై 16 సీమ వార్త సాయంత్రం** పట్టణంలోని హిందూపురం కు వెళ్లే రోడ్డు లో సరస్వతి విద్యా మందిరం ఎదురుగా ప్రధాన రహదారి ఎక్సెల్ హెవీ డ్యూటీ లో యువకుడు వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## కార్మిక సమస్యలపై... పుట్టపర్తిలో కరపత్రాలు పంపిణీ.




**పుట్టపర్తి జులై 16 సీమ వార్త సాయంత్రం.** పుట్టపర్తి పట్టణ కేంద్రంలో ఈరోజు కార్మిక సమస్యల మీద కరపత్రాలను పంచుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి బైపల్లి గంగాధర్ మరియు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సాకే వెంకటేష్ ఈనెల 30వ తేదీన విద్యుత్ ఆర్టీసీ అంగన్వాడి ఆశ స్కూల్ స్లిప్పర్స్ హమాలీలు సమస్యల మీద కలెక్టర్ గారి కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరుగుతుంది . కావున కావున కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరడం జరిగింది . ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి జయమ్మ తదితరులు పాల్గొన్నారు

## నారా లోకేష్‌ని కలసిన చిన్ని సుబ్బారావు..



**బద్వేల్ జూలై 16 సీమ వార్త. సాయంత్రం.** జమ్మలమడుగు నియోజకవర్గంలో దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి విచ్చేసినటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ గారిని కలిసినటువంటి బద్వేల్ నియోజకవర్గ ఏఎంసీ డైరెక్టర్ తొమ్మిదవ వార్డు జనసేన ఇంచార్జి చిన్ని సుబ్బారావు గారు కలవడం జరిగింది. బద్వేల్ నియోజక వర్గంలో పార్టీ బలోపేతానికి చిన్ని సుబ్బారావు మాట్లాడుతూ కూటమి అధికారంలోనిరంతరం కృషి చేస్తున్నారని, పార్టీ కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా భారీ మెజార్టీతో విజయాన్ని సాధించేలా కృషి చేయాలని సూచించారు.

## భూ అక్రమాలపై లోకేష్‌కు ఫిర్యాదు
## సమగ్ర విచారణకు హామీ

**కలసపాడు మండలంలో డీకేటీ భూముల అక్రమాలపై చర్యలు తప్పవు : మంత్రి**




**బద్వేల్ జూలై 16 సీమ వార్త. సాయంత్రం.** కలసపాడు మండలంలో ప్రభుత్వ, డి.కె.టి. భూముల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలు, కబ్జాల అంశాన్ని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, అఖిల భారత రెడ్డి సంఘం జిల్లా అధికార ప్రతినిధి చంద్రగిరి ప్రహ్లాద రెడ్డి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రహ్లాద రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు చెందాల్సిన డీకేటీ భూములు, ప్రభుత్వ భూములు రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు, కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కలిసి అక్రమంగా కాజేసినట్లు లోకేష్‌కు వివరించినట్లు చెప్పారు. అర్హులైన పేదలకు భూములు అందకుండా అనర్హుల పేర్లపై పట్టాలు మంజూరు చేయడం వల్ల వేలాది నిరుపేద కుటుంబాలు నష్టపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై స్పందించిన మంత్రి నారా లోకేష్ పేదల హక్కులను కాలరాసే వారిని ప్రభుత్వం ఉపేక్షించదని స్పష్టం చేసినట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు అందించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు. కలసపాడు మండలంలోని ప్రభుత్వ, డీకేటీ భూములపై సమగ్ర విచారణ నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు ఇస్తామని, అక్రమంగా పొందిన పట్టాలు, కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లోకేష్ హామీ ఇచ్చినట్లు ప్రహ్లాద రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా, అక్రమంగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, వాటిని రీ-లేఅవుట్ చేసి భూమిలేని నిరుపేద కుటుంబాలకు 1.50 సెంట్ల( ఎకరన్నర) చొప్పున ఇళ్ల స్థలాలుగా మరియు వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని లోకేష్ పేర్కొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడం తెలుగుదేశం పార్టీ బాధ్యత. పేదల భూములను కాజేసిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందే. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అని హామీ ఇచ్చినట్లు ప్రహ్లాద రెడ్డి తెలిపారు. చివరిగా ఆయన మాట్లాడుతూ, కలసపాడు మండలంలోని ప్రతి అర్హత కలిగిన పేద కుటుంబానికి ఇళ్ల స్థలాలు, సాగుభూములు దక్కే వరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పేదల హక్కుల పరిరక్షణే పార్టీ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.

## పార్టీ ఆదేశాలను తప్పకుండా పాటించాలి



**మడకశిర జూలై 16 సీమ వార్త సాయంత్రం** పార్టీ ఆదేశాలను తప్పకుండా పాటించాలని మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండల తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప అధ్యక్షతన నిర్వహించారు. శ్రీ సత్య సాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు టీటీడీ బోర్డు సభ్యులు నియోజకవర్గ శాసనసభ్యులు ఎమ్ ఎస్ రాజు , తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గురించి చర్చించడం జరిగింది. గుడిబండ మండలంలోని 99 .1% శాతం పూర్తిగా నమోదయింది. ఇంకా నమోదు కానివి ప్రతి బూత్ లోనూ సర్ ప్రక్రియ ఈనెల 24 వరకు గడువు పెంచినారు. కావున ప్రతి బూత్ లోను నమోదు చేయనివి ఓటర్లను బి ఎల్ ఓ దగ్గర సమన్వయం చేసుకుని మన పార్టీ బి ఎల్ ఏ అందరూ ప్రతి బూత్ లోనూ 100% పూర్తి చేయాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ చిత్ర శేఖర్ యాదవ్, రవి స్వామి, లాయర్ శివకుమార్, బూరిపల్లి జయరాం, యూనిట్ ఇంచార్జ్ జానీ, డీలర్ పురుషోత్తం, సీనియర్ టీడీపీ నాయకులు నాచేపల్లి గంగాధర్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉషశ్రీ జన్మదిన వేడుకలు



**సోమందేపల్లి జూలై 16 సీమ వార్త సాయంత్రం** మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్ వద్ద వైసీపీ శ్రేణులు శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షురాలు మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. మండల కన్వీనర్ గజేంద్ర ఆధ్వర్యంలో జడ్పిటిసి అశోక్ పట్టణ అధ్యక్షులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు పట్టణ ఉపాధ్యక్షులు గట్ట మంజు నాథ్ సమక్షంలో భారీ కేకులు కట్ చేశారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఉషశ్రీ చరణ్ నాయకత్వంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైసిపి కన్వీనర్ గజేంద్ర పిలుపునిచ్చారు. ఉషశ్రీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ కన్వీనర్ తుంగోడు నారాయణరెడ్డి, ఉప కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ నరసింహామూర్తి, కంబాలప్ప, కిష్టప్ప, మండల బూత్ కన్వీనర్ సూర్యప్రతాప్ రెడ్డి, యువజన అధ్యక్షులు జీత్తు రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షులు బాలాజీ,యూత్ నరసింహమూర్తి, ట్రాక్టర్ శ్రీరాములు, బండా శివ ప్రసాద్, ఇమామ్ వలి,వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దేవాలయాలలో పనిచేసే నాయిబ్రాహ్మణుల
## సమస్యలను పరిష్కరించాలని వినతి




**మడకశిర జూలై 16 సీమ వార్త సాయంత్రం** దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని దేవాలయాలలో పనిచేసే కళ్యాణకట్ట ,మంగళ వాయిద్య కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నాయిబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్ బుధవారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణంలో జరిగిన "తెదేపా కార్యకర్తల" సమావేశంలో రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ని కలిసి దేవాలయాలలో పనిచేసే కళ్యాణకట్ట మరియు మంగళ వాయిద్య కళాకారుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం 25 వేల రూపాయలు జీతం పెంచుతూ జీవో జారీ చేయడం జరిగిందని,జీవో అమలులో సంబంధిత శాఖ అధికారులు అలసత్యం వహిస్తున్నారని లోకేష్ దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రం సమర్పించడం జరిగింది . దేవాలయాలలో పనిచేసే నాయిబ్రాహ్మణ కళ్యాణకట్ట మరియు మంగళ వాయిద్య కళాకారులకు ఎటువంటి చెర,స్థిర ఆస్తులు లేవని కేవలం జీతం మీదనే ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటూ జీవిస్తున్నారని తెలియజేశారు. నాయిబ్రాహ్మణ కళ్యాణకట్ట మరియు మంగళ వాయిద్య కళాకారుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేసిన జీవోని తక్షణం అమలు అయ్యేలా సంబంధిత శాఖ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరడం జరిగింది.

## నేటి నుండి డ్రిప్పు స్ప్రింక్లర్స్, వారోత్సవాలు



**అమరాపురం జూలై 16 సీమవార్త సాయంత్రం** మడకశిర డివిజన్ పరిధిలోని రైతులకు ఏ.పీ.యం.ఐ.పీ. ద్వారా 2026 -27 వ ఆర్థిక సంవత్సరానికి గాను, డ్రిప్పు మరియు స్ప్రింక్లర్స్ కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నేడు అనగా శుక్రవారం నుండి ఆయా రైతు సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సత్యసాయి జిల్లా ఏ.పీ.యం.ఐ.పీ.ప్రాజెక్టు డైరెక్టర్ దేవానంద్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు ఏపీఎంఐపీ ఎం ఐ ఏ ఓ మడకశిర డివిజన్ అధికారి జివన్ నరసింహాప్ప తెలిపారు. నేటి నుండి డ్రిప్పు మరియు స్ప్రింక్లర్స్ వారోత్సవాలు వారం రోజులపాటు జరుపుకున్నట్లు యం. ఐ. ఏ. ఓ.జి.యన్. నరసింహప్ప తెలియజేయడం జరిగినది. కావున ఆయా రైతు సేవ కేంద్రాల పరిధిలోగల రైతులు తప్పకుండా విచ్చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా తెలియజేయడమైనది.ఇందుకు సంబంధించి1-బి,యఫ్. యం. బి. స్కెచ్, పొలంచెక్కుబందిసర్టిఫికెట్, ఆధార్ కార్డు,బ్యాంకు పాస్ పుస్తకం , ఎస్సీ ఎస్టీ కులానికి చెందిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం నందు 5 ఎకరంల వరకు మాత్రమే కలిగిన రైతులకు 100 శాతం సబ్సిడీ ప్రభుత్వం ద్వారా ఇస్తున్నట్లు, కావునా కుల ధ్రువీకరణ పత్రము తీసుకొని రావలసిందిగా తెలిపారు. అలాగే ఆటోమేషన్ కావలసిన రైతులు కూడా రైతు సేవా కేంద్రాలలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎం ఐ ఏ ఓ, జి ఎన్ నరసింహప్ప తెలియజేసినారు. మరిన్ని వివరాలకు 7995010074 ఫోన్ నెంబర్ తో సంప్రదించాలని ఆయన కోరారు.

## వైఎస్ఆర్సిపి మహిళ నాయకురాలు మహిళా కార్యదర్శి సాకమ్మ కు ఘన నివాళులు



**మడకశిర జూలై 16 సీమ వార్త సాయంత్రం** మండల పరిధిలోని హరే సముద్రం పంచాయితీ గొల్లపల్లి గ్రామానికి చెందిన సాకమ్మ బుధవారం రోజు పొలం పనులు పనిచేస్తుండగా పాము కాటుకు గురవడం జరిగింది. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సాకమ్మ చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించడం జరిగింది. విషయం తెలుసుకున్న వైయస్సార్సీపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వైసి గోవర్ధన్ రెడ్డి గొల్లపల్లి లోని వారి నివాసం వద్ద సాకమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారి కుటుంబాన్ని ఓదార్చడం జరిగింది. వీరితోపాటురాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి , మండల కన్వీనర్ శ్రీరాములు , పట్టణ కన్వీనర్ ఓం కుమార్ , జిల్లా యువజన విభాగం కార్యదర్శి హరే సముద్రం లక్ష్మీనారాయణ , మండల ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఈశ్వర్ , మహిళా నాయకురాలు మాలమ్మ కుమార్ ఇతర కార్యకర్తలు నాయకులు కలిసి నివాళులు అర్పించడం జరిగింది..

## దీర్ఘాయుష్మాన్ భవ అంటూ ఉషశ్రీకి ....
## గోరంట్ల నేతల దీవెనలు

**మండల వైసీపీ శాఖ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఉషశ్రీ జన్మదిన వేడుకలు.**

**ఆసుపత్రి ఆవరణలో కేక్ కటింగ్, రోగులకు పాలు, బ్రెడ్ లు పంపిణీ.**




**గోరంట్ల జులై 16 సీమ వార్త సాయంత్రం.** తాము అభిమానించే నాయకురాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీమంత్రి ఉషశ్రీ పుట్టినరోజును పురస్కరించు కొని గోరంట్ల వైసిపి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారుచేసిన కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టి అనంతరం గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ చేసి అభిమాన నేత ఉషశ్రీ పై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. గోరంట్ల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ వెంకటేష్, పట్టణ కన్వీనర్ శంకర, మాజీ ఎంపీపీ ఫక్రుద్దీన్, రాణా ప్రతాప్ సింగ్, లు మాట్లాడుతూ వైసీపీ పార్టీలో ఉషశ్రీ చరణ్ నాయకత్వం గ్రామీణ స్థాయి కేడర్ కు అండగా నిలుస్తోందని అలాంటి నాయకురాలు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుడిన్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, అంజన్ రెడ్డి, జీనం వాండ్లపల్లి సాయి, శ్రీనివాసులు, సుభహన్, సోమశేఖర్, కురవ సత్య నారాయణ, గంగిరెడ్డి, ఈశ్వరా,బాబావాలి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881